
సాక్షి
బాపట్ల

శనివారం ၊ 2 ၊ సెప్టెంబర్ ၊ 2023




ప్రత్యేక పూజల్లో న్యాయమూర్తి

చిలకలూరిపేట: బొప్పూడిలోని మల్లేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 3920 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 74.09 శాతం పింఛన్ల పంపిణీ



బాపట్లఅర్బన్: తెల్లవారకముందే తలుపు తట్టి వైఎస్సార్ పింఛన్ కానుక డబ్బులు అందజేయడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మురిసిపోయారు. వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు శుక్రవారం ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. జిల్లాలోని 2,28,672 మంది పింఛన్ దారులకు రూ.62.58 కోట్ల నగదును ప్రభుత్వం మంజూరు చేయగా అధికారులు పంపిణీ చేపట్టారు. సాయంత్రానికి 74.09శాతం పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

చెరువులో పడి చిన్నారి మృతి

కొమ్మూరు(కాకుమాను): చెరువులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని కొమ్మూరులో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కొమ్మూరుకు చెందిన గార్లపాడు పంచాయతీ కార్యదర్శి గుంటూరు నాగ సందీప్ కుమారుడు సాయి(3)తోటి చిన్నారులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గ్రామంలో ఉన్న మంగళి చెరువులో పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు చిన్నారిని బయటకు తీసే సమయానికే మృతి చెందినట్లు తెలిపారు.

విచారణ చేయకుండా ఓట్లు తొలగించొద్దు
జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా




చీరాల టౌన్: ఊరి నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారు, మృతిచెందిన వారి ఓట్లు తొలగింపులో విచారణ జాగ్రత్తగా చేయాలని.. విచారణ చేయకుండా ఓట్లు తొలగించొద్దని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సిబ్బందికి సూచించారు. శుక్రవారం చీరాల మున్సిపాలిటీలో పలు వార్డుల్లో పర్యటించిన కలెక్టర్ ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను విచారించడంతోపాటుగా శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓటర్ల ఇంటికి వెళ్లి కలెక్టర్ విచారణ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, పర్యవేక్షించే అధికారులు బూత్ లెవల్ అధికారుల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇటీవల మృతిచెందిన మృతుల ఓట్లతోపాటుగా శాశ్వతంగా ఊరి నుంచి వెళ్లిన ఓట్లు తొలగించే విషయంలో పునః పరిశీలన చేసుకోవాలన్నారు. ఓట్లు తొలగించిన మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి విచారణను చేశారు. ఓట్ల తొలగింపులో ఎలాంటి ఇబ్బందులు లేకండా పనిచేయాలన్నారు. ఇటీవల మృతిచెందిన వారి వివరాలను ఓటర్ల జాబితాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. కలెక్టర్ వెంట హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పరాశరం కృష్ణకాంత్, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఏఓ ఉమాశంకర్, బీఎల్‌వోలు, వీఆర్వోలు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

సోపిరాల గ్రామంలో

చినగంజాం: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా 2024లో భాగంగా శుక్రవారం మండలంలోని సోపిరాల గ్రామంలో బాపట్ల జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా క్షేత్ర స్థాయి ఓట్ల పరిశీలన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చినగంజాం మండలం సోపిరాల గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఓటర్ల ఇంటింటి పర్యటించాకు. 2022 జూన్ నుంచి 2023 జూన్ వరకు ఫారం 7 ద్వారా ఓట్లు నమోదు చేసుకున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో గ్రామంలో తొలగించిన 11 మంది ఓట్లకు సంబంధించి వారిలో 9 మంది చనిపోయిన వారి గృహాలను ఆయన సందర్శించి విచారణ నిర్వహించారు. గ్రామంలోని 273, 274 పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి అక్కడి మౌలిక వసతులను తహసీల్దార్ పార్వతిని అడిగి విచారించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,800, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

ప్రతి గుండెలోనూ వైఎస్సార్..

మరపురాని మహానేత గురుతులు

- సంక్షేమం, అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యం వైఎస్ పాలన
- ఉచిత విద్యుత్‌తో బీడు భూముల్లో బంగారు పంటలు
- రైతు రుణమాఫీ,
- ఆరోగశ్రీతో ఉచితవైద్యం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు, ఉద్యోగాలు
- జలయజ్ఞంతో సాగునీటి పరవళ్లు
- వేల కోట్లతో రహదారుల నిర్మాణం
- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్
- నేడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి



నమస్తే చెల్లిమ్మా.. నమస్తే అక్కయ్య.. నమస్తే తమ్ముడు.. అనే వైఎస్సార్ పిలుపు ప్రతి ఇంటా మేల్కొలుపు అయింది.. నువ్వు ఇచ్చిన ఆరోగ్యశ్రీ భరోసాతో మా ఇంటి దీపం వెలిగింది.. చదువుల కొలిమిలో నలిగిన పేదలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రక్ష అయింది.. రైతన్నకు సాయం లేక ఉరితాడు మెడలో వేలాడే సమయంలో రుణమాఫీ ఆసరా అయింది.. వ్యవసాయం లాభసాటి చేసేందుకు.. వృథా జలాలు ఒడిసి పట్టేందుకు చేపట్టిన జలయజ్ఞం సిరులు పడిస్తోంది. వైఎస్సార్ అను నేను.. అంటూ ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం మా మదిలోనే ఉండి పోయింది.. నువ్వు ఎక్కడికి పోతావు రాజన్నా అంటూ స్మరించుకుంటున్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా...

సాక్షి ప్రతినిధి,బాపట్ల: తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో వయస్సుతో నిమిత్తం లేకుండా అందరి గుండెల్లో చెరగని ముద్రవేసి, అయిదున్నరేళ్ల పాలనలో అందరికీ అన్నీ ఇచ్చి దివికేగిన దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి గురుతులు చెరిగిపోనివి, చెదిరి పోనివి. ఆయన అందరినీ వీడి 14 వసంతాలు గడచినా జనం ఆయనను మరిచిపోలేదు. ఆయన మిగిల్చిన జ్ఞాపకాలు జనం మదిని వీడలేదు. ఆ మహానేత వారసత్వంగా ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిని మరపించేలా సుపరిపాలన అందిస్తుండటంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 2 వర్ధంతి సందర్భంగా బాపట్ల జిల్లా వాసులు మహానేతను, ఆయన పాలనను మరోమారు మననం చేసుకుంటున్నారు.



నిజాంపట్నంలో ఇందిరమ్మ ఇళ్ల సముదాయ నిర్మాణ పైలాన్ ఆవిష్కరిస్తున్న మహానేత వైఎస్సార్(ఫైల్)

జిల్లాలో అభివృద్ధికి బాటలు

వైఎస్సార్ ఐదేళ్ల పాలనాకాలంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలోని ప్రస్తుత బాపట్ల జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు.

- అద్దంకి నియోజకవర్గంలో భవనాశి రిజర్వాయరు, కొరిశపాడు ఎత్తిపోతల, ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. వాటిలో కొంతమేర పనులు జరగ్గా వైఎస్సార్ మరణం తర్వాత పనులు నిలిచిపోయాయి. రూ.1100 కోట్లతో మేదరమెట్ల–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పనులు పూర్తిచేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే పథకాల పనులు వేగవంతం చేశారు. కొరిశపాడు పనులు దాదాపు పూర్తికాగా, ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పనులు 75 శాతం పూర్తయ్యాయి.
- పర్చూరు నియోజకవర్గంలో రూ.400 కోట్లతో నాగార్జునసాగర్ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి ఆయకట్టుకు నీరందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కింది. బకింగ్‌హామ్, ఓగేరువాగు, పర్చూరువాగుల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారు. పర్చూరు–చీరాల రోడ్డు పనులు పూర్తిచేశారు.
- చీరాల నియోజకవర్గంలో కృష్ణా డెల్టా ఆధునికీకరణ పనులకు రూ.2 వేల కోట్లు కేటాయించారు. చేనేతలకు 50 సంవత్సరాల వయస్సుకే పింఛన్‌ను ఇప్పించారు. చిలపనూరుపై ఉన్న 22 శాతం ఎక్సైజ్ సుంకాన్ని వైఎస్సార్ రద్దు చేశారు. రంగు, రసాయనాలు, నూలుపై 10 శాతం సబ్సిడీ ఇచ్చారు.
- బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ప్రధానంగా కర్లపాలెం మొదలుకొని తీరప్రాంతంలో వేలాది ఎకరాల ఇసుక భూములు బీళ్లుగా ఉండేవి. వైఎస్సార్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించి ఆ భూములను సాగులోకి తెచ్చి వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందించారు.
- రేపల్లె నియోజకవర్గంలో కృష్ణా డెల్టా ఆధునికీకరణ, పంట కాలువలు, డ్రెయిన్ పనులతో పాటు కరకట్ట, రోడ్ల నిర్మాణపనులు పూర్తిచేశారు.
- వేమూరు నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టారు.

వేల కోట్లు వెచ్చించి బీటీ, సిమెంటు రోడ్లు నిర్మించారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదల ప్రాణాలను నిలబెట్టారు. వేలాది మంది రైతులకు రుణవిముక్తి కలిగించారు. మహిళలను ఆదుకున్నారు. ప్రతి పేదవాడికి ఇంటిని నిర్మించి ఇచ్చాడు. అందుకే వైఎస్సార్ జనం గుండెల్లో దేవుడయ్యాడు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిబాటలో నడుస్తూ సంక్షేమం, అభివృద్ధి పథకాలతో జనరంజక పాలన సాగిస్తున్నారు.

ప్రాణదాత వైఎస్సార్..



ఫొటోలోని ఇతని పేరు మంకెన సుధాకర్. భాగ్యనగర్, చినగంజాం మండలం. చాలాపేద కుటుంబం. అనుకోకుండా గుండె సమస్య వచ్చింది. వైద్యులను సంప్రదిస్తే శస్త్ర చికిత్స చేయాల్సిందేనని లేకుంటే చనిపోతావని తేల్చి చెప్పారు. రూ.2 లక్షలకు పైగా ఖర్చువుతుందని చెప్పారు. అంత డబ్బు లేదు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయిస్తుందని తెలిసి ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్యమిత్రలను సంప్రదించాడు. ఆరోగ్యశ్రీని వర్తింపజేసి రూ.2 లక్షలు వైద్యాన్ని ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్స చేయించి మరీ ఇంటికి పంపారు. ప్రాణభిక్ష పెట్టిన దేవుడు వైఎస్సార్. శస్త్ర చికిత్స చేయించుకొని 15 ఏళ్లు దాటిపోయింది. జీవితాంతం అభిమానంగా ఉంటాం.

ఆనందోత్సాహాలు



ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

- సెర్ప్ ఉద్యోగులకు 23 శాతం పెరిగిన జీతం
- క్యాడర్‌ను బట్టి రూ.5000 నుంచి రూ.16 వేల వరకు పెంపుదల
- బాపట్ల జిల్లాలో 112 మంది ఉద్యోగులకు ప్రయోజనం

బాపట్ల అర్బన్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పరిధిలో పనిచేసే సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ) ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరికి కొత్త జీతాలు అందుతాయి. కొంతకాలంగా జీతాలు పెంచాలని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జీతాలు పెంచుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా సీఎం జగన్ చిత్రపటానికి ఉద్యోగులు క్షీరాభిషేకాలు చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పథకాల అమలులో కీలకంగా

బాపట్ల జిల్లాలో సెర్ప్‌లో 112 మంది ఉద్యోగులు ఉన్నారు. డ్వాక్రా గ్రూపుల అభివృద్ధి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, జగనన్న పాలవెల్లువ, ఉన్నతి వంటి పథకలను మహిళలకు పారదర్శకంగా అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు, స్వయం ఉపాధి, వ్యాపారాలకు తోడ్పాటు అందిస్తున్నారు.

బేసిక్‌పై 23 శాతం వరకు

సెర్ప్ ఉద్యోగులకు బేసిక్ వేతనంపై 23 శాతం జీతం పెంచారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏ పీఎం), డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం), అడ్మిన్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్స్ (ఏఏ) ఉద్యోగులు పనిచేస్తున్నారు. సీసీల జీతం రూ.25 నుంచి రూ.40 వేలు ఉండగా వారికి రూ.5750 నుంచి రూ.9200 వరకు, ఏపీఎంలకు జీతం రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఉండగా రూ.9200 నుంచి రూ.11500 వరకు, డీపీఎంలకు జీతం రూ.60వేల నుంచి రూ.70 వేల వరకు ఉండగా వారికి రూ.13,800 నుంచి రూ.16,100 వరకు, ఏఏలకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు జీతం పెరిగింది.

చాలా సంతోషం



సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం జీతాలు పెంచడం సంతోషం. మా గురించి ఆలోచన చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–యు.సుబ్బారావు, డీపీఎం, బాపట్ల

మరింత బాధ్యతగా పనిచేస్తా..



ఈనెల నెల నుంచి పెరిగిన జీతం వస్తుంది.జీతాల పెరుగుతాయని ఎదురు చూస్తున్న మాకు సీఎం తీసుకున్న నిర్ణయం సంతోషం కలిగించింది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తా.

– ఎం.సుమలత, కమ్యూనిటీ కోఆర్డినేటర్, కంకటపాలెం క్లస్టర్

సెప్టెంబర్ నుంచి అమలులోకి



ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ బాపట్ల సెర్ప్ ఉద్యోగులకు బేసిక్‌పై 23శాతం జీతం పెంచడం హర్షణీయం. బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పరిధిలో 112 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారికి కేడర్ బట్టి రూ.ఐదు నుంచి రూ.16 వేల వరకు జీతాలు పెరిగాయి. పెరిగిన జీతాలను ప్రభుత్వం వారికి నేటి నుంచి చెల్లిస్తుంది.

– బొంత అర్జున్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- కౌలు రైతులకు భరోసా
- 16,393 మంది ఖాతాల్లో రూ.12.29 కోట్లు జమ

బాపట్ల: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ 5వ ఏడాది తొలివిడత పెట్టుబడినిధి, మే నుంచి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడత కింద లక్షా 70 వేల 965 మంది రైతుల ఖాతాల్లో రూ.94.03 కోట్లు జమ చేశామన్నారు. 16 వేల 393 మంది కౌలు రైతులకు అయిదో సంవత్సరం వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడతగా రూ.12.29 కోట్ల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేసిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి సాగు పెట్టుబడి నిధి రూ.13,500 చొప్పున ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు. కౌలు రైతులకు మేలు చేయాలనే దృక్పథంతో అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఆగస్టు మాసంలో వర్షాలు తక్కువగా ఉన్నందున నీటి వినియోగంలో అశ్రద్ధ వహించవద్దని రైతులకు సూచించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ రైతుల పక్షపాతి ప్రభుత్వంగా పాలన సాగుతోందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. వ్యవసాయ సలహామండలి చైర్మన్ మంతెన దశరథమహారాజు, వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, ఉద్యాన శాఖ ఏడీ జెన్నెమ్మ, ఏపీఎంఐపీ పీడీ పి.వి.రమణ పాల్గొన్నారు.



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన, ఎమ్మెల్సీ సునీత

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరిరెడ్డి

గురుపూజోత్సవం నాడు అవార్డు ప్రదానం



ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడవర్తి పేరిరెడ్డి ఎంపికయ్యారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పేరిరెడ్డి ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వంచే అవార్డు అందుకోనున్నారు. పిడవర్తి పేరిరెడ్డి 1992న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. 2003లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)గా ఉద్యోగోన్నతి పొందాడు. 2010 నుంచి ఆయన ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు. 2017లో రెగ్యులర్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సర్వీస్‌లో చేరిన దగ్గరి నుంచి అంకితభావంతో పనిచేస్తూ, సెలవులను సైతం పొదుపుగా వాడుకుంటూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి నిరంతరం కృషి చేశారు. 2000 నుంచి 2023 వరకు పాఠశాల ఎన్‌సీసీ అధికారిగా పనిచేశారు. గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో అనేక సాంఘిక సేవా కార్యక్రమాలను ఎన్‌సీసీ విద్యార్థులచే నిర్వహించారు. 2009లో నేషనల్ గ్రీన్ కోర్ పర్చూరు డివిజన్ గ్రీన్ మాస్టర్ ట్రైనర్‌గా పనిచేశారు. ఎన్‌సీసీ తన సేవలను గుర్తించి 2002, 2003 సంవత్సరాల్లో ఎన్‌సీసీ గుంటూరు గ్రూపు నందు ఉత్తమ ఎన్‌సీసీ అధికారిగా అవార్డు పొందారు. 2008లో ప్రకాశం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. పాఠశాలలోను, నేషనల్ గ్రీన్ కోర్ పర్చూరు డివిజన్‌లో తను చేసిన కృషి ఫలితంగా 2010లో అప్పటి కలెక్టర్ కాంతిలాల్ దండే చేతుల మీదుగా ఉత్తమ గ్రీన్ పాఠశాల అవార్డు స్వీకరించారు. 2011, 2016 సంవత్సరాల్లో తిరుపతిలో సీవీఎస్, తేజ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. 2021లో 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయితగా పనిచేశారు. పేరిరెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై నందుకు పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు చెంచు పున్నయ్య, పాఠశాల కరస్పాండెంట్ గోరంట్ల పున్నయ్య, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మిస్సింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: మిస్సింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం వర్చువల్ విధానంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 2022లో నమోదైన కేసులు, ఇప్పటివరకు విచారణ దశలో ఉన్నా మిస్సింగ్ కేసులు, 9న జరగనున్న మెగా లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగ్గ కేసులు, మహిళలపై జరిగిన నేరాలలో నిందితులకు శిక్షలు పడేవిధంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పీపీటీ ద్వారా స్క్రీన్‌పై కేసులను ప్రదర్శించి దర్యాప్తులో పురోగతి గురించి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.



పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీసుల సమస్యల పరిష్కారమే పోలీస్ వెల్ఫేర్ డే ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరుపున, పోలీసుశాఖ నుంచి వారికి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాలు పొందని కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని, వారికి త్వరితగతిన కారుణ్య నియామకం పొందే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 2023 జూన్ 23న అనారోగ్యంతో మృతి చెందిన 2008వ బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ (3963) మోపిదేవి చలపతి రావు సతీమణి శ్రావణికి రూ.25 వేల ఫ్లాగ్ ఫండ్, రూ.50 వేల విడో ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఓఎంఎఫ్ రెహ్మాన్, ఏఆర్‌డీఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ బి. శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్లు


బండను లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ట, అభయాంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పాల పండ్ల సైజ్ ఎడ్ల బండలాగుడు పోటీలు హోరా హోరీగా జరిగాయి. పోటీల్లో 21 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెద్దపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 2,766 అడుగులతో మొదటి స్థానంలో నిలిచాయి. విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు ఎడ్లు 2,700 అడుగులతో ద్వితీయ, అనంతపురానికి చెందిన బీ భవానీ ఎడ్లు 2,509 అడుగులతో తృతీయ, వైఎస్సార్ జిల్లా దాసరిపల్లె బీ చంద్రకాంత్, ఆంజనేయులు ఎడ్లు 2,492 అడుగులతో నాలుగో, ప్రకాశం జిల్లా సీఎస్‌పురం కే వెంకటాద్రి ఎడ్లు 2,400 అడుగులతో ఐదో, వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం నల్లగుండుపల్లె వల్లూరి రవీంద్రారెడ్డి ఎడ్లు 2,154 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరసుగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలను దాతలు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సౌజన్య



బాపట్ల అర్బన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బాపట్ల మండలం వృక్షనగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య ఎంపికయ్యారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి స్పోకెన్ ఇంగ్లిష్ మాడ్యూల్, కాన్ఫడెన్షియల్ మెటీరియల్, వలంటీర్ మాన్యువల్ వంటి మాడ్యూస్ రాశారు. వీటితోపాటు నేషనల్ టాయ్ ఫెయిర్‌లో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి అందరి మన్ననలను పొందారు. కరోనా సమయంలో విద్యార్థులకు వర్క్ షీట్లు తయారు చేసి వాట్సాప్ ద్వారా బోధించి గృహ సందర్శనలు చేసి ఇచ్చిన వర్క్ షీట్లను పరిశీలిస్తూ బోధన చేశారు. కోవిడ్ సమయంలో వేతనాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, పేద విద్యార్థులకు తమ వంతు సహాయంగా నిత్యావసరాలు అందించారు. కోవిడ్ సమయంలో రూ.లక్ష విలువ చేసే ఆక్సిజన్ కాన్సెంట్రేటర్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి చేతుల మీదుగా ఉచితంగా ప్రజలకు అందించారు. ఆంగ్ల భాషలో ఇంటర్నేషనల్ స్థాయిలో సర్టిఫికెట్లను పొందారు. ఉపాధ్యాయులకు సింగపూర్ అకాడమీ వారితో ఎస్ఎస్‌సీ ఈఆర్‌టి వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించారు. యూట్యూబ్‌లో ఉపాధ్యాయులకు గణితంపై శిక్షణను అందించారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం సౌజన్య టి.ఎల్.ఎ. యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి అత్యంత ఆసక్తికరంగా విద్యాబోధనను ఆటలు పాటలతో అందిస్తున్నారు. రెండు లక్షల మందికి పైగా దేశ, దేశాల నుంచి పది మిలియన్ మంది వీక్షిస్తున్నారు. ఈ విధంగా తన ఉపాధ్యాయ వృత్తినీ నిరంతరం కొనసాగిస్తున్నారు. పిల్లల అభివృద్ధి తన లక్ష్యంగా భావిస్తూ విద్యార్థులకు బోధనను అందిస్తున్నారు.

యూకో బ్యాంక్
స్వాధీనతా ప్రకటన
Email : gunmoc@ucobank.co.in
[illegible]

విధి నిర్వహణలో ఒత్తిళ్లు అధిగమించాలి

రిటైర్డు అధికారి జె.మురళి


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి జె.మురళి

బాపట్ల: విధి నిర్వహణలో వచ్చే స్వల్పమైన ఒత్తిళ్లను అధిగమించవచ్చని రిటైర్డు అధికారి జె.మురళి పేర్కొన్నారు. బాపట్లలోని విస్తర్ణ కేంద్రంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ విధుల్లో ఒత్తిళ్లు లేకుండా ఏవిధంగా పని చేయాలనేది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పంచాయితీ వ్యవస్థలో ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ కోర్స్ డైరెక్టర్ రాంప్రసాద్, బాపట్ల డీఎల్పీఓ పి.డి.ఎస్.శరత్ బాబు, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- మంత్రి మేరుగ నాగార్జున
- వేమూరు అభివృద్ధిపై సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మాణం 50 శాతం పూర్తి కాగా వేమూరు నియోజకవర్గం 40 శాతం ఉందని చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం 11,523 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 5,350 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేయ జరిగిందన్నారు. ఆరువేల ఇళ్లు ఇంక ప్రారంభించ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనిచేయకుంటే వెళ్లిపోండి...

పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందు సాగడం లేదని చెప్పారు. మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. పంచాయతీ రాజ్ అధికారులు పనులు అంచనాలు వేయక పోవడంతో పనులు నిలిచిపోయినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గం పనిచేస్తున్న అధికారులు లక్ష్యాలను పూర్తి చేయలేకుంటే వెళ్లిపోవాలని మంత్రి మేరుగ నాగార్జున హెచ్చరించారు.

డెల్టాకు నీరందించాలి..

ఖరీఫ్‌లో వరి సాగుకు అవసరమైన సాగునీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి మేరుగ సూచించారు. అందుకు తగిన విధంగా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ సచివాలయానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. పనులు చేసిన వారం రోజుల్లో డబ్బులు అకౌంట్‌కు జమ చేయడం జరుగుతుందని వివరించారు. పార్టీ నాయకులు ముందుకు వచ్చి గడప గడపకు మన ప్రభుత్వం పనులు త్వరగా చేపట్టాలని కోరారు. ముందుకు రాక పోతే టెండర్లు వేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి బొంత అర్జునరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎంపీపీ యల్లమాటి మోహన్, దావూరి వెంకట లలిత కుమారి, జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యులు గాజులు హేమలత, తిరువీధులు ఉదయ భాస్కరి పాల్గొన్నారు.

చంద్రబాబు పాపం పండే రోజు దగ్గర్లోనే..

ఎంపీ మోపిదేవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నగరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాపం పండే రోజు దగ్గర్లోనే ఉందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని చినమట్లపూడిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బాబు సీఎంగా ఉన్న సమయంలో పలు నిర్మాణ కంపెనీలకు కాంట్రాక్టులు, బోగస్ సబ్ కాంట్రాక్టులు ఇప్పించి సుమారు రూ.118 కోట్లు ముడుపులు అందటంతో ఐటీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వచ్చిన కథనాలపై ఎంపీ స్పందించారు. చంద్రబాబుకు స్కాంలు చేయడం, ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్యఅన్నారు. స్కాంలు ఎల్లో మీడియాకు కనబడవా అని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన స్కాంల నుంచి బయటపడేందుకు కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకోవడం అలవాటేనని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన ప్రమాణాలతో పాటు ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయని చెప్పారు. పేద ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని పేర్కొన్నారు. కమీషన్‌ల రూపంలో రూ.118 కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు దోచుకున్నారని విమర్శించారు. ఆయన వెంట ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న సుబ్బారెడ్డి

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా చీరాల పట్టణానికి చెందిన ఆట్ల సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. విశాఖపట్నంలో రెడ్డి జేఏసీ 26జిల్లాల అధ్యక్షుల నియామకాలు గతఆదివారం చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు విప్పుల శివకుమా ర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రతిభావంతులైన పేదలకు విద్యా, ఉపాధి అంశాల్లో చేయూతనివ్వడానికి రెడ్డి జేఏసీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని సుబ్బారెడ్డి ఈ సందర్భంగా 'సాక్షి'కి తెలిపారు.

కోలలపూడిని సందర్శించిన గుజరాత్ వ్యవసాయ బృందం

ప్రకృతి సేద్యం పరిశీలన


ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న గుజరాత్ బృంద సభ్యులు

మార్టూరు: మండలంలోని కోలలపూడిలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయాధిరిత పంట సాగును గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. బృంద సభ్యులు దీక్షిత్, యోగేష్, సోమయ్య మాట్లాడుతూ గుజరాత్ గవర్నర్ ఆదేశాలతో తాము ఆంధ్రప్రదేశ్‌లో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం తీరుతెన్నులు పరిశీలించేందుకు వచ్చినట్లు వివరించారు. స్థానిక రైతు బోలగాని వెంకటస్వామి ప్రకృతి సేద్యంతో పండిస్తున్న పంటలు, కూరగాయలు, జామ తోటలు, నవధాన్యాల సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా పంటలపై వినియోగిస్తున్న ద్రవ జీవామృతం, నీమాస్త్రం తదితర సేంద్రియ ఎరువులను పరిశీలించారు. పండించిన పంటలు మార్కెటింగ్ చేస్తున్న విధానం, గిట్టుబాటు ధరల గురించి రైతు వెంకటస్వామిని ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.సతీష్ కుమార్, బాపట్ల జిల్లా అధికారి వాణిశ్రీ, కో ఆర్డినేటర్ వెంకట్రావు, పీడీ ఎం.బ్రహ్మయ్య, ఏటీఎం వాసుబాబు, ఏపీఎం రాజారత్నం పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల్ని రానున్న రెండు నెలల్లో ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో 3జీ సిమ్ ఉన్న వారు కస్టమర్ సర్వీస్ సెంటర్స్‌లో ఈ నెల 30వ తేదీలోపు ఉచితంగా సిమ్‌లను పొందవచ్చని ఆ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 4జీ సిమ్‌గా మార్చుకున్నప్పటికీ 2జీ, 3జీ సేవల్లో ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. అధిక సాంకేతిక భద్రత కోసం బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు గతంలో పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డ్‌తో బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం సిమ్ 3జీ, 4జీ సిమ్ అని తెలుసుకోవడానికి తమ మొబైల్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మేసేజ్ పంపాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చీరాల కేంద్రంగా మళ్లీ గోల్డ్ మాఫియా

- ముఠాలోని కీలక నిందితుడి అరెస్టు
- 47 కేజీల వెండి తరలించడంపై కేసు
- భారీగా చేతులు మారిన బంగారం
- విజయవాడ, తెనాలి, చీరాల బంగారు దుకాణాలకు విక్రయం
- విచారిస్తున్న తెనాలి పోలీసులు


గత ఏడాది రవితేజ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నగదును మీడియాకు చూపుతున్న చీరాల పోలీసులు

చీరాల: మళ్లీ గోల్డ్ మాఫియా కలకలం రేగింది. బంగారం, వెండి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులకు విక్రయించడంపై ఫిర్యాదులు అందాయి. చీరాల, విజయవాడ, తెనాలి ప్రాంతాల్లో భారీగా లావాదేవీలు జరిగినట్లు సమాచారం. నిఘా పెట్టిన తెనాలి టూటౌన్ పోలీసులు ముఠాలోని కీలక నిందితుడు చీరాలకు చెందిన రవితేజను అదుపులోకి తీసుకుని తెనాలికి తరలించారు.

వివరాలు.. పోర్టుల ద్వారా బంగారాన్ని ఇతర దేశాల నుంచి తెచ్చి కస్టమ్స్ అధికారుల సహకారంతో తక్కువ ధరకు బంగారం విక్రయాలు చీరాల కేంద్రంగా నిర్వహిస్తున్నారు. బంగారం బిస్కెట్ల రూపంలో తక్కువ ధరకు ఎటువంటి లెక్కా పత్రం లేకుండా వస్తుండటం, ర్యాప్ (దొంగ బంగారం)కు తలదన్నేలా తక్కువ ధరకు బంగారం వ్యవహారం ప్రస్తుతం చీరాలలో తెరవెనుక ప్రముఖుల కనుసన్నల్లో గుట్టుగా నడుస్తోంది. చీరాలలో గుట్టుచప్పుడుగా చోటుచేసుకున్న ఈ వ్యవహారంలో అంతర్గత సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలతో అసలు బండారం బయటపడింది. కోట్ల రూపాయలలో బంగారం బిస్కెట్ల క్రయవిక్రయాలు జరిగాయని సమాచారం. నిఘా ఉంచిన పోలీసులు ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఇందులో ప్రముఖ బంగారు వర్తకుడు కీలకపాత్ర పోషిస్తున్నాడు.

బురిడీ పొక్కిందిలా...

గతేడాది చౌక బంగారం విషయంలో మొత్తం రూ.35 కోట్లు విలువ ఉన్న 700 బిస్కెట్లు క్రయవిక్రయాలు జరిగాయనేది భోగట్టా. అయితే తక్కువ ధరకు బంగారం వస్తుందని నమ్మడంతో పలువురు వ్యాపారులు కూడా జత కలిశారు. ఈ వ్యవహారం భాగస్వాములుగా ఉన్న వారి మధ్య విభేదాలు రావడంతో విషయం బయటకు పొక్కింది. చివరకు భాగస్వాములకు కూడా ఇది అసలు బంగారమేనా అనే అనుమానాలు రావడంతో కీరోల్ పోషించిన వ్యక్తిని నిలదీశారు. లావాదేవీలు, రశీదుల విషయంలో విభేదాలు రావడంతో వ్యవహారం బయటకు వచ్చింది. చీరాల ప్రాంతంలో ప్రస్తుతం చౌకగా బంగారం దొరుకుతుందని కొందరు ఏజెంట్లు నమ్మబలుకుతూ బంగారం వ్యాపారులలో ఆశలు రేపుతున్నారు. ఆశల ఊబిలో పడి కొందరు బంగారం వ్యాపారులు కూడా ఇరుక్కుపోతున్నారు.


సౌదీ టూ విజయవాడ వయా సింగపూర్..

బంగారం ఉత్పత్తి కేంద్రమైన సౌదీలోని ఖతర్ నుంచే స్మగ్లింగ్ ముఠా బంగారాన్ని తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఖతర్ నుంచి సింగపూర్‌కు, అక్కడ నుంచి విజయవాడకు వాయు, జల మార్గాల ద్వారా బంగారం బిస్కెట్లు తీసుకువస్తున్నట్లు సమాచారం. తీసుకువచ్చిన బంగారాన్ని ఏజెంట్ల ద్వారా విజయవాడ నుంచి తెనాలి, నెల్లూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎటువంటి లెక్కా పత్రాలు లేకుండా తక్కువ ధరకు రావడంతో వ్యాపారులు కూడా వీరివైపు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారులు చెల్లించిన నగదు కూడా బ్లాక్ మని కావడంతో ఫిర్యాదులు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఇదే కేటుగాళ్లకు ఆసరా అయింది. తీసుకున్న డబ్బుకు ఎటువంటి పత్రాలు కూడా లేకపోవడంతో కేటుగాళ్లు బంగారం వ్యాపారులను వలలో వేసుకుంటున్నారు. బంగారం ఇవ్వకుండ మోసానికి పాల్పడుతున్నారు.

47 కేజీల వెండి తరలించారనే సమాచారంతో వెలుగులోకి..

గోల్డ్ మాఫియాలో కీలకంగా ఉన్న నిందితుడు రవితేజ దొంగతనం చేసిన వీరి వద్ద నుంచి 47 కేజీల వెండి తక్కువ ధరకు కొనుగోలు చేసి చీరాల ప్రాంతంలో కొన్ని బంగారు దుకాణాల్లో విక్రయించాడని తెనాలి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శుక్రవారం వేకువజామున చీరాల బండావారి వీధిలోని రవితేజ ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా రవితేజ ప్రతిఘటించి పోలీసుల మీదనే దాడికి పాల్పడే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు రవితేజను బలవంతంగా కారులో తెనాలి తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు. అయితే రవితేజ వద్ద నుంచే భారీగా బంగారం, వెండి కొనుగోలు చేసి ఎలాంటి పత్రాలు, జీఎస్టీ బిల్లులు లేకుండా ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న బంగారు వ్యాపారుల్లో భయాందోళన మొదలైంది.

కారు ఢీకొని.. వ్యక్తి మృతి


మృతి చెందిన యోహాన్

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న బైక్‌ని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొరిశపాడు జాతీయ రహదారి స్పినింగ్ మిల్లు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. జే.పంగులూరు మండలంలోని నార్నెవారిపాలెం గ్రామం భగవాన్‌రాజుపాలేనికి చెందిన పూర్ణగంటి యోహాన్(50) బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. కొరిశపాడు సమీపంలోని నీలి ఆక్వా ఫ్యాక్టరీలో వాచ్‌మెన్ ఉద్యోగం ఖాళీగా ఉందని అందులో చేరేందుకు అడగటానికి బయలు దేరాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు వస్తున్న స్కూటీ రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో విజయవాడ నుంచి చెన్నైకు వెళ్తున్న కారు బైక్‌ని ఢీ కొంది. దీంతో యోహాను రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన అథ్లెటిక్ మీట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–14, 16 బాలబాలికలు అండర్–18, 20 యువతీ యువకుల అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది పాల్గొన్నారన్నారు. 100, 200 ,400, 800, 1500 పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రోలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా జట్టును ఎంపిక చేసి ఈ నెల 20 నుంచి ఏలూరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- Wanted a Job and Acquire Good Knowledge, Join in Four Year Degree Revolution with BBA, B.Sc Electronics, B.Sc Comp Science, B.Com Comp App 9177408565
- Wanted a Job and Acquire Good Knowledge, Join in Four Year Degree Revolution with BA Special English, BA Economics, BA History. 9177408565
- Eligible for scholarships, join 4year Degree at PLNM Degree College with BBA, B.Sc Comp / Electronics, B.Com Comp App, BA Econ/ Spel English / History. Only Few Seats Left. 9177408565

ADMISSIONS

- ఉచిత విద్య, ఉచిత వసతి SC, ST, BC, మైనార్టీ విద్యార్థులకు ANM,GNM, అనస్థీషియా, రేడియాగ్రఫీ,OT,మెడికల్ ఇమేజింగ్,DMLT,మేల్ నర్సింగ్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. 8885999144

PARAMEDICAL

- ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radiographic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry, ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225

REAL ESTATE

- గుంటూరు సిటికి అతి చేరువలో వున్న నంబూరు, బుడంపాడు, గార్లవారిపాలెం, లాం, కొర్నెపాడు, తాడికొండ, అడ్డరోడ్డు బ్యాంకు లోన్‌తో CRDA అప్రూవల్ ప్లాట్లు కలవు. 7794960734
- చిలకలూరిపేట క్రొత్త NH-16 ప్రక్కన గణపవరం ఐళ్ళ మధ్యలో మరియు కావూరు లింగంగుంట్లలో తక్కువ రేట్లకే ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. పొలాలు కొనాలన్నా/అమ్మాలన్నా సం: 7013338424
- ప్రభుత్వ ఉద్యోగులకు సువర్ణ అవకాశం మీ గ్రామంలోనే ఉంటూ మా సంస్థ ప్లాట్లను విక్రయిస్తూ అదనపు ఆదాయం సంపాదించుకొనే సువర్ణ అవకాశం. Details: 81849 55577

FLAT FOR SALE

- గుంటూరు రాజేంద్ర నగర్ 1వలైను గొర్రెపాటి కళ్యాణ మండపం రోడ్‌లో గల శ్రీ లక్ష్మి రెసిడెన్సి అపార్ట్‌మెంట్ నందు ప్లాట్‌నెం 201,E/F & N/F 1175 SFTకార్‌పార్కింగ్ అమ్మబడును. సంప్రదించుము: 9666347789
- వర్ధమాన్ : ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వే గేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 38.50 లక్షలకే అమ్మబడును. ఫోన్: 98481 10543, 70936 09070

PLOT FOR SALE

- అమరావతి ముఖద్వారం పత్తిపాడు రైల్వేస్టేషన్‌కు 2kmలో అబ్బినేనిపేట రోడ్డు నందు మెయిన్ రోడ్ ఫేసింగ్‌లో 167 చ.గ. ఇళ్ళ స్థలాలు కలవు. సంప్ర: 8184955577, 8555045699
- బాపట్ల సిటీ, జమీందారు పేట నందు 120 చ.గ.లు (లేక) 2.5 సెంట్లు ఖాళీ నివేశన స్థలం అమ్మకమునకు కలదు. ✆ 98487 73032
- తాడేపల్లి హైదెక్ వాకులు డిస్ట్రిక్స్ అపార్ట్‌మెంట్స్, హౌసెస్ మధ్యలో వెంటనే ఇంటి నిర్మాణమునకు అనువైన రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్మకం. స్పాట్ రిజి. ఫోన్: 83339 16062

TO-LET COMMERCIAL

- గుంటూరు, విద్యానగర్, 1/4, లిటిల్ ఫ్లవర్ స్కూల్ దగ్గర, 3BH, గ్రౌండ్‌ఫ్లోర్, గవర్నమెంట్, ప్రైవేట్ ఆఫీస్‌లకు, కోచింగ్ సంస్థలకు, వ్యాపార సంస్థలకు, ఫ్రీస్కూల్‌కు అనుకూలం. 9885521339

SERVICES

- మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగినా /10th, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికేట్స్ తెప్పించబడును. సర్టిఫికేట్స్ కరెక్షన్ పేరు మార్పిడి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు 9849185616

BUSINESS OFFER

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 8500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520.

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299
- బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

TOURS & TRAVELS

- కార్తీకపౌర్ణమి సందర్భంగా కాశీయాత్ర 22-11-2023, దుర్గాపూర్, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాల్,అలహాబాద్, సీతామడి, 9రోజులు టి॥ ఒక్కింటికి 10500. STట్రావెల్స్. 9885853240

MARRIAGE SERVICES

- క్రిష్టియన్ మాల వరుడు కావలెను. 24Y, చామనఛాయ రెండవ సంబంధము వధువుకు హైదరాబాద్‌లో గవర్నమెంట్ (లేక) ప్రైవేట్ జాబ్ కలిగిన వరుడు కావలెను. సంప్ర॥ 9100228505

WANTED

- ఓవర్సీస్ ఎడ్యుకేషన్ నందు పనిచేయుటకు లేడీకౌన్సిలర్స్ కావలెను. ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత. అ:డిగ్రీ, MBA. జీ:15K-20K 9666649908
- ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు 3సం॥లు అనుభవంకల్గిన అకౌంటెంట్&బిల్లింగ్ కన్‌స్ట్రక్షన్ సివిల్ ఇంజనీర్ కావలెను. ఫోన్ చేయవలసిన సమయం:ఉ॥3PM-6PM 9248198999
- ఫిరంగిపురంలోని DDUGKY సంస్థ నందు లేడీ టీచర్స్ English, Soft skills, Computer Faculty, Brarband Technician Faculty కావలెను. 9951279786, 9032916708
- LOT మొబైల్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్ కావలెను. జీతం: Take Home 12500 ఆపైన, 4/7, బ్రాడీపేట, గుంటూరు. సంప్ర॥ 7330624555
- హోటల్ కుంభకర్ణ కొరిటెపాడు, గుంటూరు నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్(బాయ్) కావలెను. ఉ॥ 6 నుండి మ॥2గం వరకు జీతం 10వేలు. సంప్ర॥ 9885109440
- గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్, స్టూడెంట్స్ మార్కెటింగ్ అసోసియేట్స్, ఇంటి వద్దనే ఉండి నెలకి ఆకర్షణీయమైన జీతం ఆపైన సంపాదించే అవకాశం మంత్లీ మెయింటెనెన్స్ లైఫ్ అలవెన్స్ కలవు. RR's ఇన్‌ఫ్రా డెవలపర్స్, నరసరావుపేట. 8827894789
- Urgent need Pre primary Mother Mother Teachers and Chemistry, Maths, DTP Operator and College incharges 8885356929
- ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు PRO's, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. వ: 30-50 సం॥ అనుభవం గల వారికి ప్రాధాన్యత. గుడ్ శాలరీ+TA ఇవ్వబడును. 8712287169
- 100% బెడ్స్ అయుర్వేదిక్ హాస్పిటల్, భాష్యం, రామేశయ్య క్యాంపస్ వెనుక గోరంట్లలో పనిచేయుటకు లేడి రిసెప్షనిస్ట్-2, మెడికల్ షాపులో, క్లీనర్స్, ఆయాలు, వంటమనిషి కావలెను. 9440870099
- గుంటూరు అరండల్‌పేట ప్రముఖ AC హోటల్ నందు పనిచేయుటకు నైట్ రిసెప్షనిస్ట్ బాయ్ మరియు హౌస్‌కీపర్ మహిళలు కావలెను. సంప్ర: 9090919126
- అతిథి గృహ ఫుడ్స్ హరిహరమహల్ ప్రక్కన గుంటూరులో పనిచేయుటకు అనుభవం గల సేల్స్ గర్ల్స్ కావలెను. అర్హత: 10th/ఇంటర్, వయస్సు: 18-35సం॥, టైం: 8am-8pm, 9am-9pm, 10am-10pm, జీతం: 15,000/- సంప్ర॥ 9396971898
- గుంటూరు, కార్తికేయ హోంకేర్ సర్వీసెస్ నందు ఇంటిపని, వంటపని, పేషంట్స్‌ను చూసుకొనుటకు అనుభవం గల M/F కావలెను. జీ:18K+భోజనం 8367494367, 8985856731
- ప్రముఖ కంపెనీ నందు ఆర్గానిక్ ఎరువులను సేల్స్ చేయుటకు యువతి యువకులు కావలెను. జీతం:15K ఆపైన రూం+భోజనం బైక్ మస్ట్ వెంటనే జాయినింగ్. 9493357516
- గుంటూరు లోకల్‌లో పదల నివారణ పని చేయుటకు వర్కర్స్ పు/లు కావలెను. వయస్సు: 18–40, టైమ్: 9am to 6pm. Ph: 7013674154
- గుంటూరు జిల్లాలో HDFC, ICICI, Axis బ్యాంకులలో కం॥ఆపరేటర్స్-10, క్యాషియర్స్-5,క్లర్క్స్-7, అకౌంటెంట్స్-8,మేనేజర్స్-10.ఆకర్షణీయమైనజీతం 7386879373
- పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్ ఇన్సూరెన్స్ మేనేజర్స్ కావలెను. P/T వర్క్ ఫ్రమ్ హోమ్, ఫిక్స్‌డ్ శాలరీ+ఇన్సెంటివ్స్ మార్కెటింగ్ & రిటైర్డ్ వర్కర్స్‌కి ప్రాధాన్యత. 9949839400
- డ్యూటి డాక్టర్స్, ఫామ్-డి, నర్సెస్, రిసెప్షనిస్ట్స్, వాచ్‌మెన్ కావలెను. అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459
- గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ నందు మార్కెటింగ్ మరియు టెలికాలింగ్ చేయుటకు వివాహితులైన స్త్రీలు కావలెను. Q: ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత. ✆ 86396 89939, 90309 93895
- బాపట్ల జిల్లా మార్టూరులోని మా మీనాక్షి మ్యాచింగ్ సెంటర్ నందు గల బ్యూటీ పార్లర్‌లోను కంప్యూటర్ వర్క్ (జాకెట్స్)కు పనిచేయుటకు అనుభవజ్ఞులైన మహిళలు కావలెను. గుడ్ శాలరీ ✆ 70750 62931
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, ఛాయిస్ నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుచున్నది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.